TELANGANA RISING 2047

RNI.No. TELTEL/2010/32434

# అన్వేష నేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :11 సంచిక : 343 | గురువారం 26 మార్చి 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00




## గ్యాస్ బుకింగ్‌కు 35 రోజుల విరామం..

### నిజం కాదని ప్రకటించిన కేంద్రం..

పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా దేశంలో చమురు, గ్యాస్ కొరతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ప్రజలను భయపెట్టేలా రకరకాల వార్తలు ప్రచారం లోకి వస్తున్నాయి. వంట గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువును చమురు కంపెనీలు 35 రోజులకు పెంచినట్టు మంగళవారం వార్తలు హల్‌చల్ చేశాయి.

వార్త 2లో

### శత్రువులు పశ్చాత్తాప

# పడేవరకూ ప్రతీకార దాడులు ఆగవు



- దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడమే మా తొలి ప్రాధాన్యం'
- హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న అభద్రతకు ఈ దురాగతాలే ప్రత్యక్ష కారణం
- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ

వివరాలు 2లో..

ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్తున్నప్పటికీ.. ఇరాన్ నుంచి వస్తోన్న సందేశాలు మాత్రం ధిక్కార ధోరణిని కనబరుస్తున్నాయి. ఆ రెండు దేశాలు చేసిన దురాక్రమణకు గానూ.. వారు పశ్చాత్తాప పడేంతవరకూ తమ దాడులు కొనసాగిస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చిచెప్పారు. తమ మిత్ర దేశం చైనాతో ఫోన్ సంభాషణలో భాగంగా అరాగ్చీ ఈ వ్యాఖ్యలు చేసినట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌కు చెందిన పౌర, రక్షణ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా శత్రు దేశాలు దాడులు చేయడంతోనే టెహ్రాన్‌లో అస్థిరత చోటుచేసుకుందని అరాగ్చీ తెలిపారు.



## పాకిస్థాన్ నౌకను వెనక్కి పంపించిన ఇరాన్..

పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలు ఏవైనా తమ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఇరాన్ షరతులు విధించింది.

వార్త 2లో

### పెట్రోల్, డీజిల్ కొరత లేదు..

# భయపడకండి



- అవసరానికి సరిపడా నిల్వలు
- రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్
- ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోంది
- ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్ రాష్ట్రంలో ఉందని మంత్రి వెల్లడించారు.

వార్త 2లో

# ఆ ఇళ్లను కొత్త వారికి ఇస్తాం

- గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష
- ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



శాసనసభ సమావేశాల్లో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేపట్టి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థా యిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు.

వార్త 2లో



## కాంగ్రెస్ పార్టీకి షాక్.. ప్రధాన కార్యాలయం ఖాళీ చేయాలంటూ నోటీసు

వార్త 2లో

## పొత్తు పెట్టుకుంటే తప్పేంటి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**హైదరాబాద్:**
బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా పలు రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. డీలిమిటేషన్ జరిగితే గ్రేటర్ హైదరాబాద్‌లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. టీడీపీ పార్టీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం అదే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం రాజకీయాల్లో సాధారణమైందని సుధీర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. అలాగే, సర్ నిర్వహించడం మంచిదేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాను సమగ్రంగా నవీకరించడం అవసరమని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తగ్గిపోవడంపై కూడా ఆయన స్పందించారు. ఐదేళ్ల పాటు నగరంలో నివసించే ఓటర్లు, ఓటింగ్ రోజు తమ స్వగ్రామాలకు వెళ్లడం వల్ల గ్రేటర్‌లో పోలింగ్ శాతం తగ్గుతోందని ఆయన తెలిపారు.





2

## బినామీల పేర్లతో ఆస్తులు కూడబెట్టాడు: ఎమ్మెల్యే పల్లా



2

### ఏడుగురు ఎమ్మెల్యేలతోపాటు

## స్పీకర్‌కు నోటీసులు

# శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు ఆగవు: ఇరాన్

### దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడమే మా తొలి ప్రాధాన్యం'

### హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న అభద్రతకు ఈ దురాగతాలే ప్రత్యక్ష కారణం

### ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ

ఇంటర్నెట్‌డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్తున్నప్పటికీ.. ఇరాన్ నుంచి వస్తోన్న సందేశాలు మాత్రం ధిక్కార ధోరణిని కనబరుస్తున్నాయి. ఆ రెండు దేశాలు చేసిన దురాక్రమణకు గానూ.. వారు పశ్చాత్తాప పడేంతవరకూ తమ దాడులు కొనసాగిస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చిచెప్పారు. తమ మిత్ర



దేశం చైనాతో ఫోన్ సంభాషణలో భాగంగా అరాగ్చీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌కు చెందిన పౌర, రక్షణ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా శత్రు దేశాలు దాడులు చేయడంతోనే టెహ్రాన్‌లో అస్థిరత చోటుచేసుకుందని అరాగ్చీ తెలిపారు. 'మా లక్ష్యాలన్నీ నెరవేరడం సహా హింసాత్మక దురాక్రమణకు పాల్పడిన శత్రు దేశాలు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు కొనసాగుతాయి. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడమే మా తొలి ప్రాధాన్యం' అని ఇరాన్ విదేశాంగ మంత్రి చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న అభద్రతకు ఈ దురాగతాలే ప్రత్యక్ష కారణమని ఆయన అన్నారు. అందులో భాగంగానే హోర్ముజ్ జలసంధిని మూసివేశామని.. తాము తీసుకున్న చర్యలన్నీ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే ఉన్నాయని వివరించారు. మరోవైపు.. ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చలకు అమెరికా సంకేతాలిస్తుండగా.. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ గూఢచర్య కేంద్రాలే లక్ష్యంగా వరుస దాడులు ప్రారంభించినట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. ఇరాన్‌లో ప్రముఖ వ్యక్తులతో తమ చర్చలు కొనసాగుతున్నాయని, ఇది పాలనాపరమైన మార్పునకు సంకేతమని యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ పేర్కొన్న తరుణంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

## గ్యాస్ బుకింగ్‌కు 35 రోజుల విరామం..

### నిజం కాదని ప్రకటించిన కేంద్రం..

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా దేశంలో చమురు, గ్యాస్ కొరతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ప్రజలను భయపెట్టేలా రకరకాల వార్తలు ప్రచారంలోకి వస్తున్నాయి. వంట గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువును చమురు కంపెనీలు 35 రోజులకు పెంచినట్టు మంగళవారం వార్తలు హల్‌చల్ చేశాయి. ఆ వార్తలపై తాజాగా కేంద్ర ప్రభుత్వం స్పందించింది.ఎల్పీజీ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవని కేంద్రం పెట్రోలియం శాఖ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నిజం కాదు. గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుంది' అని కేంద్రం ఓ ప్రకటన విడుదల చేసింది.గ్యాస్ బుకింగ్ విషయంలో ఆందోళనలు వద్దని, అలాగే అవసరం లేకపోయినా బుకింగ్‌లు చేయవద్దని ప్రజలకు కేంద్రం సూచించింది. రెండు సిలిండర్లు ఉంటే గ్యాస్ బుకింగ్ మధ్య అంతరాయాన్ని 35 రోజులకు పెంచినట్టు మంగళవారం నుంచి వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఆ వార్తలన్నీ అబద్ధాలని కేంద్రం ప్రకటనతో తాజాగా తేలింది.

## పాకిస్థాన్ నౌకను వెనక్కి పంపించిన ఇరాన్..

### హోర్ముజ్ గుండా ప్రయాణానికి అనుమతి నిరాకరణ..

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలు ఏవైనా తమ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఇరాన్ షరతులు విధించింది. ముందస్తు అనుమతులు లేని నౌకలను హోర్ముజ్ గుండా ప్రయాణించడానికి అనుమతించేది లేదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా పాకిస్థాన్‌కు చెందిన కంటైనర్ నౌకను ఇరాన్ వెనక్కి పంపించినట్టు ఐఆర్‌జీసీ వెల్లడించింది.హోర్ముజ్ గుండా ప్రయాణించడానికి ముందుస్తు అనుమతులు లేకపోవడంతో కరాచీ వెళ్తున్న కంటైనర్ నౌకను ఐఆర్‌జీసీ వెనక్కి పంపంచిందిల). ఈ విషయాన్ని పాకిస్థాన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కూడా ధ్రువీకరించింది. హోర్ముజ్ గుండా ప్రయాణించే ప్రతి నౌక, ఇస్లామిక్ రిపబ్లిక్ ఇరాన్ సముద్ర యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని, లేకపోతే తాము జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని ఐఆర్‌జీసీ స్పష్టం చేసింది.శత్రు దేశాలకు చెందినవి తప్ప మిగిలిన నౌకలన్నీ హోర్ముజ్ గుండా ప్రయాణించవచ్చని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది . అయితే తమ నుంచి ముందస్తు అనుమతులు మాత్రం తీసుకోవాలని తేల్చి చెప్పింది. కాగా, ఇరాన్–అమెరికా మధ్య శాంతి చర్చలు పాక్ వేదికగా జరగబోతున్నాయని, ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల నేతలు పాల్గొంటారని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

## కాంగ్రెస్ పార్టీకి షాక్.. ప్రధాన కార్యాలయం ఖాళీ చేయాలంటూ నోటీసు

న్యూఢిల్లీ: అన్వేషనేత్రం ప్రతినిధి

దేశ రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి అధికారులు నోటీసు అందించారు. ల్యుటియన్స్ జోన్ ఖాళీ చేయాలని అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిట్ నోటీసు( ఇచ్చారు. అలాగే 5వ నెంబర్ రైసినా రోడ్‌లోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ని కూడా ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్చి 28లోపు రెండు ప్రాంగణాలను ఖాళీ చేయాలని డెడ్‌లైన్ విధించారు అధికారులు. కాగా, 1978 నుంచి అంటే దాదాపు 48 ఏళ్ల నుంచి అక్బర్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను కాంగ్రెస్ నిర్వహిస్తోంది. అయితే, బలవంతపు తొలగింపును అడ్డుకునేందుకు న్యాయపరమైన మార్గాలను పరిశీంచి కోర్టును ఆశ్రయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, గతేడాది కోట్లా మార్గ్‌లో తమ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. అయినప్పటికీ అక్బర్ రోడ్ ప్రాంగణాన్ని ఇంకా ఖాళీ చేయలేదు. పార్టీ కార్యకలాపాలు అక్కడే కొనసాగుతున్నాయి. అక్బర్ రోడ్ కార్యాలయంతో తమకు ఎంతో భావోద్వేగ బంధం ఉందని పలువురు పార్టీ సీనియర్లు చెబుతున్నారు.

### చారిత్రక ప్రాధాన్యం..

ఈ భవనానికి చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో వైస్రాయ్ లార్డ్ లిన్లిత్‌గో కార్యనిర్వాహక మండలి సభ్యుడైన సర్ రెజినాల్డ్ మాక్స్‌వెల్ ఇక్కడే నివసించారు. 1960ల ప్రారంభంలో భారతదేశంలో మయన్మార్ రాయబారి అయిన డా.ఖిన్ కీ నివాసంగా ఉండేది. ఆ తర్వాత నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న డా.ఖిన్ కీ కుమార్తె ఆంగ్ సాన్ సూకీ చాలా సంవత్సరాలు అక్కడే నివాసం ఉన్నారు. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందింది. దీంతో పార్టీ చీలిపోయే పలిస్థితులు వచ్చాయి. ఇందిరాగాంధీ వర్గానికి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఓ భవనం కావాల్సి వచ్చింది. ఇందిరా గాంధీకి విధేయుడైన అప్పటి రాజ్యసభ ఎంపీ జి.వెంకటస్వామి అక్బర్ రోడ్‌లోని తన బంగ్లాను ఇచ్చారు. ఇక, అప్పటి నుంచి కాంగ్రెస్ తరఫున ప్రధానమంత్రులైన రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ సహా అందరూ దీన్ని ప్రధాన కార్యాలయంగా కొనసాగించారు.

## పెట్రోల్, డీజిల్ కొరత లేదు.. భయపడకండి

### అవసరానికి సరిపడా నిల్వలు

### రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్

### ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోంది

### ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్:

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్ రాష్ట్రంలో ఉందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోందని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. సివిల్ సప్లై శాఖ మొత్తం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు. ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా డ్రమ్స్, కంటైనర్లలో పెద్ద ఎత్తున ఇంధనం నిల్వ చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంధన డిమాండ్ సుమారు 25 శాతం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 1200 ట్యాంకర్ల ద్వారా సరఫరా జరుగుతోందని చెప్పారు. పెట్రోల్ బంక్‌లు అనవసరంగా మూసివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బినామీల పేర్లతో ఆస్తులు కూడబెట్టాడు: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్: (తొలిసాక్షి)

అసెంబ్లీ లాబీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేశారు. దేవాదుల ప్రాజెక్టు సృష్టికర్త తానేనని కడియం చెప్పుకోవడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేవాదుల ప్రాజెక్టు కోసం కడియం శ్రీహరి ఎలాంటి పాత్ర పోషించలేదని పల్లా ఆరోపించారు. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు తానే సృష్టికర్తనని చెప్పుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.అలాగే కడియం శ్రీహరికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో అవకాశాలు ఇచ్చారని తెలిపారు. ఎంపీ, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వంటి కీలక పదవులతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు కూడా రాజకీయ అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. కడియం శ్రీహరి బినామీ పేర్లతో ఆస్తులు కూడబెట్టారని పల్లా రాజేశ్వరరెడ్డి ఆరోపించారు. ఆయన నిజాయితీ గల నాయకుడు కాదని తీవ్రంగా విమర్శించారు. ఇక డీలిమిటేషన్ జరిగినా జనగామ ప్రజలకు సేవ చేయడం కొనసాగిస్తానని పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఆ ఇళ్లను కొత్త వారికి ఇస్తాం

### గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

### ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్:

శాసనసభ సమావేశాల్లో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేపట్టి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు.ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులు ఆక్యూపై చేయలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

## ఏడుగురు ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు నోటీసులు

హైదరాబాద్,

పార్టీ మారలేదన్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సైతం కోర్టు నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు.ఈ అంశంపై ఈ రోజు విచారణ జరిగింది. దాంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన జాబితాలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికేపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు ఉన్నారు. ఏప్రిల్ 16వ తేదీ ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

### హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్..

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పిటిషనర్లు స్పష్టం చేశారు. వారంతా బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకొని ఆ పార్టీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లిన పిటిషనర్ల తరఫు న్యాయవాది. అన్ని మీడియాల్లోనూ వీరు కండువా కప్పుకున్న దృశ్యాలు వచ్చాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు చెబితేనే స్పీకర్ స్పందిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది వివరించారు.పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరితే.. ఏడాది పాటు ఎలాంటి చర్య తీసుకోలేదని తెలిపారు.

## రష్యా నుంచి భారత్‌కు 60 మిలియన్ బ్యారెళ్ల చమురు... వచ్చే నెలలో డెలివరీ



హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

భారత చమురు సంస్థలు రష్యా నుంచి సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మన దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తోంది. ఇది వచ్చే నెలలో డెలివరీ కానున్నట్లు బ్లూమ్‌బర్గ్‌లో కథనం వచ్చింది.బ్రెంట్ క్రూడ్ ధర కంటే బ్యారెల్‌కు 5 నుంచి 15 డాలర్లు అధికంగా చెల్లించి భారత రిఫైనరీలు ఈ చమురును బుక్ చేసినట్లు ఈ కథనం పేర్కొంది. ఈ మొత్తం ఫిబ్రవరిలో చేసిన చమురు కొనుగోళ్ల కంటే రెట్టింపు అని వెల్లడించింది. రష్యా చమురుపై ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో తాజా కొనుగోళ్లు జరిగాయి.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నంత కాలం రష్యా చమురుపై ఆంక్షల మినహాయింపును అమెరికా పొడిగించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. రష్యా నుంచి ఈ చమురు కొనుగోలుకు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను కూడా అమెరికా ఎత్తివేయడంతో, ఆ దేశ చమురును కూడా భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

## 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది.భారత ప్రధాన న్యాయమూర్తి (జజీ×) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది.పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు.అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని, చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.



ప్రభుత్వ విప్ గా నియమితులైన సందర్భంగా శాసనసభాపతి గౌరవ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన., ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారు పాల్గొన్నారు..

## హైదరాబాద్-శ్రీశైలం ప్రయాణంలో ఇక కొత్త అధ్యాయం..



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో కలిసి శ్రీశైలం రహదారి అభివృద్ధిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ గారితో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నాం.. హైదరాబాద్ నుండి మన్ననూర్ వరకు 6 లేన్ల రహదారి,మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు 52 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం.. అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా,ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా రూ. 7,600 కోట్లతో ఈ ప్రాజెక్ట్ చేపట్టబోతున్నాం.. భక్తుల సౌకర్యం,రోడ్డు భద్రతే మా ప్రాధాన్యత..ఉదయం వెళ్లి సాయంత్రానికి దర్శనం ముగించుకుని వచ్చేలా ప్రయాణ సమయం తగ్గనుంది..త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి తుది అనుమతులు సాధించి,పనులు ప్రారంభిస్తాం..

## భక్తి శ్రద్ధలతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం... వెన్నాచెడ్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరణ ఘనంగా

మండలంలోని వెన్నాచెడ్ గ్రామంలో జరగనున్న శ్రీ శ్రీ బండమిది రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజల మధ్య ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ పరిసరాలు శుభ్రపరచి, ప్రత్యేక అలంకరణలతో సిద్ధం చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా నిర్వహించడం వెన్నాచెడ్ గ్రామానికి ప్రత్యేకతగా నిలుస్తుందని, ఈసారి మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య మాట్లాడుతూ, రామస్వామి బ్రహ్మోత్సవాలు గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని, గ్రామ యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహిళలు, యువకులు, పెద్దలు సమిష్టిగా కృషి చేస్తే ఉత్సవాలు మరింత భక్తిరసభరితంగా జరుగుతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, వాహన సేవలు, హరినామ సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశముండటంతో భద్రత, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవికాంత్ రెడ్డి, మాజీ రాజా చైర్మన్ రాంరెడ్డి, శరణప్ప, రాములు గౌడ్, చెంద్రయ్య, మహేందర్, సంజీవులు, ఎల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి గ్రామస్థులు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు.

## ఇంధన కొరత వదంతులు నమ్మొద్దు

### తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు -- ఎస్పీ డి. జానకి హెచ్చరిక

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ స్పష్టం చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న అసత్య ప్రచారాల కారణంగా ప్రజల్లో అనవసర ఆందోళన నెలకొంటోందని, దీని ఫలితంగా పెట్రోల్ బంకుల వద్ద రద్దీ పెరుగుతోందని తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని వివరించారు.

# సీఎస్ఈలో రావి దీప్తికి పీహెచ్.డీ.

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని రావి దీప్తి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'వాహనాల ఇంటర్నెట్ లోకి తెలివిగా చొరబడటాన్ని గుర్తించే వ్యవస్థ (స్మార్ట్ ఇంట్రూషన్ డిటెక్షన్ సిస్టమ్) కోసం సమర్థవంతమైన అభ్యాస -ఆధారిత విధానం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.హిమబిందు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ దీప్తి పరిశోధన, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ వెహికల్స్ (ఐవోవీ) పర్యావరణ వ్యవస్థలో చొరబాటు గుర్తింపు విధానాలను బలోపేతం చేయడానికి రూపొందించిన వినూత్న అభ్యాస-ఆధారిత ఫ్రేమ్ వర్కును అందిస్తుందని తెలిపారు. సైబర్ బెదిరింపులను గుర్తించడానికి, నిరోధించడానికి అధునాతన మెషిన్ లెర్నింగ్ పద్ధతులను అన్వయించడం ద్వారా అనుసంధానించిన వాహన నెట్ వర్కుల భద్రత, విశ్వసనీయత, సామర్థ్యాన్ని పెంచడం ఈ అధ్యయనం లక్ష్యమన్నారు. స్మార్ట్ ట్రాన్స్ పోర్టేషన్ సిస్టమ్ లలో సైబర్ సెక్యూరిటీ యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను ఈ పరిశోధన ప్రముఖంగా ప్రస్తావిస్తోందని తెలిపారు. సురక్షితమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే తెలివైన చలనశీల మౌలిక సదుపాయాలు (మొబిలిటీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్లను) నిర్మించడంపై విలువైన అవగాహనను కల్పిస్తుందన్నారు. డాక్టర్ దీప్తి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరిశోధనలో, వృత్తిపరంగా ఆమె మరిన్ని విజయాలను సాధించాలని వారు అభిలషించారు.

## రోబోటిక్ శస్త్రచికిత్స విస్తరణకు క్వాలిటీ కేర్-ఇంట్యూ్యాటివ్ ఒప్పందం

ఆధునిక వైద్య సేవలను దేశ వ్యాప్తంగా విస్తరించే దిశగా, ప్రముఖ ఆరోగ్య సేవా సంస్థ క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్, మినిమల్లీ ఇన్వాసివ్ కేర్‌లో ప్రపంచ స్థాయి టెక్నాలజీ సంస్థ




ఇంట్యూ్యాటివ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంట్యూ్యాటివ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ రోహిత్ మహాజన్ తో కలసి అయన మాట్లాడుతూ ముఖ్యంగా టైర్ 2, టైర్ 3 నగరాల్లోని రోగులకు ఈ అధునాతన చికిత్స అందుబాటులోకి తీసుకు రావడం ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా సర్జన్లు వైద్య బృందాలకు శిక్షణ ఇవ్వడంతో పాటు, నిరంతర సాంకేతిక మద్దతు అందించి వారి వైద్య సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా కేర్ హాస్పిటల్స్, కిమ్‌హెల్త్, ఎవర్‌కేర్ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌లో రోబోటిక్ సహాయంతో చేసే శస్త్రచికిత్స సేవలను దశలవారీగా విస్తరించనున్నారని తెలిపారు.

## మండలంలో ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీలు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) విస్తృతంగా పర్యటించారు జంగంపడిగ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి,పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, రికార్డులను పరిశీలించారు. గర్భిణీలకు, బాలింతలకు సక్రమంగా పాలు, గుడ్లు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దోసపహాడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంపీడీఓ, విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట గదిని శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీని సందర్శించి మొక్కల పెంపకంపై ఆరా తీశారు. రాబోయే వర్షాకాలం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని అధికారులకు,సిబ్బందికి సూచించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్, పాఠశాల ఉపాధ్యాయులు, ఫీల్డ్ అసిస్టెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...




## వృద్ధాశ్రమానికి నిత్యవసర సరుకుల అందజేత.

కుమార్తె జోషిక జన్మదిన వేడుకలు సందర్భంగా అశ్వాపురం ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమానికి పదివేల రూపాయల విలువ గల క్వింటా బియ్యం నిత్యాసర వస్తువులు అందించి మానవతను చాటుకున్నా డు సింగరేణి కార్మికుడు రాము. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పీకే ఓసి 2 లో ఈపి ఆపరేటర్ గా పనిచేస్తున్న మద్ది రాము, దివ్య దంపతులకు కుమార్తె జోషిక జన్మదిన వేడుకలు అశ్వాపురం ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమంలో బుదవారం ఘనంగా జరుపుకున్నారు. తన పుట్టినరోజు వేడుకలు సందర్భంగా వృద్ధులకు సహాయం చేయాలనే తమ కుమార్తె జోషిక అభ్యర్థన మేరకు తల్లిదండ్రులు సుమారు పదివేల విలువగల క్వింటా బియ్యం నిత్యాసర వస్తువులు వృద్ధాశ్రమానికి అందజేసి తమ మానవతను చాటుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్డీ సర్ పాషా మాట్లాడుతూ వృద్ధాశ్రమం నిర్వహణ అనేది వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని దాతల సహకారంతో విజయవంతంగా నడిపిస్తున్న షేక్ షహనాజ్ మేహరాజ్ దంపతులను ఆయన అభినందించారు. వేసవి నేపథ్యంలో వృద్ధులు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగి షేక్ గఫూర్, బంధు వులు ఎం సత్యం, సాంబలక్ష్మి, వృద్ధాశ్రమం నిర్వాహకులు షేక్ షహనాజ్, మేహారాజ్ తదితరులు పాల్గొన్నారు.


## ఏప్రిల్ 3న ఎస్.బి. ఐ.టి.లో ఆరోహన్ 2026

### కార్యక్రమ పోస్టర్ ను ఆవిష్కరించిన కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మం ఎస్.బి. ఐ.టి.కళాశాలలో ఏప్రిల్ 3న విద్యార్థుల ఆట,పాట లతో పాటు వారిలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసే ఆరోహన్ బి2026 కార్యక్రమం జరగనుంది.దీనిలో భాగంగా కార్యక్రమ పోస్టర్ ను కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ బుదవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా నిర్వహించే ఆనవాయితీని కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్నికల్ ఈవెంట్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆరోహ న్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులలోని ఒత్తిడిని తగ్గిస్తూ వారిలోని శారీరక, మానసిక వికాసానికి, సృజనాత్మకతను పెంపొందిస్తూ వారిలో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు తమ కళాశాల ఆనవాయితీ గా నిర్వహిస్తుందని తెలిపారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి,,వైస్ ఛైర్మన్ డాక్టర్ జి.శ్రీ చైతన్య ప్రిన్సిపల్ డా క్టర్ జి. రాజ్‌కుమార్ లు మాట్లాడుతూ ఏప్రిల్ నెల 3, 4 తారాఖులలో ఆరోహన్ – 2026 నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 3వ తారీఖున ప్రాజెక్ట్ ఎక్స్‌పోతో పాటు



టెక్నికల్ ఈవెంట్స్‌ను నిర్వహించి 4వ తారీఖున సాంస్కృతిక కార్యక్రమాలతో కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రతివిభాగం నుండి వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.








RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్: గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

**సంపాదకీయం...**

# పిపిపి మెడికల్ కాలేజీలు - ప్రమాదకర విధానం



రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వైద్య రంగంలో ప్రమాదకర ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పిపిపి) విధానానికి తెర లేపింది. గత వైసిపి ప్రభుత్వంలో మంజూరయిన 10 ప్రభుత్వ వైద్య కళాశాలలు వీటికి అనుబంధంగా ఏర్పడే ఆసుపత్రులను ప్రవేట్ సంస్థల ఆధీనంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం మీద విమర్శలు గుప్పిస్తూ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను ప్రైవేట్ శక్తుల చేతుల్లో పెట్టబోతున్నది. వైసిపి ప్రభుత్వ కాలంలో మంజూరైన 17 వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పిపిపి పద్ధతిలో రూ.8548 కోట్ల నిధులు ఆమోదించగా కేవలం నాలుగేళ్లలో రూ.2225 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి ఐదు కళాశాలలనే అరకొరగా పూర్తి చేసిందని చంద్రబాబు ప్రభుత్వం విమర్శిస్తున్నది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కూటమి ప్రభుత్వం పిపిపి విధానాన్ని వైద్య రంగంలో అమలుకు పూనుకుందని చెబుతూనే ఈ విధానం ఎంతో గొప్పదని, ప్రజలకు చాలా మేలు కలుగుతుందని ప్రచారం చేస్తున్నది. పైపెచ్చు పిపిపి అంటే ప్రైవేటీకరణ కాదని కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలు, ఆసుపత్రులు అన్నీ ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని, కావాలనే ప్రతిపక్ష పార్టీలు బురద జల్లుతున్నాయని ప్రజలను నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నది. పిపిపి విధానాన్ని రాష్ట్రంలో ప్రజలు, అన్ని పక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. నిరసనలు, ఆందోళనలు సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సింది పోయి చాలా దౌర్జన్య పూరితంగా వ్యవహరిస్తున్నది. దేశంలో జాతీయ రహదారులన్నీ పిపిపి పద్ధతిలో ఉన్నాయని, అవి ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్ళలేదు కదా అని ముఖ్యమంత్రి ఏకంగా అడ్డగోలు వాదనలు చేస్తున్నారు. మొత్తం 10 వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టటానికి రాష్ట్ర కూటమి ప్రభుత్వం వేగంగా చర్యలు ప్రారంభించింది. ఒక్కో మెడికల్ కాలేజీలో 150 ఎంబిబిఎస్, 24 పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ల ప్రాతిపదికన, 625 పడకల సామర్థ్యంగల ఆసుపత్రి నిర్మాణంతో మొదటి దశగా మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ఇవ్వటానికి ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్ల ప్రకటన కూడా ప్రభుత్వం విడుదల చేసింది. పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం వైద్య కళాశాలలకు రెండో దశలో టెండర్లను పిలవడానికి ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. టెండర్లలో పేర్కొన్న ఒప్పంద పత్రాన్ని పరిశీలిస్తే పిపిపి విధానం ఎంత ప్రమాదకరమో, ప్రజావనరులను ఈ ప్రభుత్వం తమకు కావలసిన వారికి ఎలా ధారాదత్తం చేస్తున్నదో అర్థమౌతుంది. ఒప్పంద పత్రంలో ప్రతిపాదిత అంశాలు 1. ఒప్పంద కాలపరిమితి 66 ఏళ్లు 2. ఏడాదికి ఎకరానికి లీజు కింద రూ.100 చొప్పున కాంట్రాక్టర్ ప్రభుత్వానికి చెల్లించాలి. 3. మొత్తం 625 పడకలలో 70 శాతం ఆరోగ్యశ్రీ కార్డు కలిగి ఉన్న వారికి కేటాయించాలి. వీరికి సెలెక్ట్ పేషంట్స్ అని పేరు పెట్టారు. 4. మిగిలిన 30 శాతం బెడ్ లను కమర్షియల్‌గా వినియోగించుకొని కార్పొరేట్ ఫీజులు వసూలు చేసుకోవచ్చు. 5. ఒప్పందం అయిన ఒక ఏడాది కాలంలో 100 ఎంబిబిఎస్ సీట్లతో కాలేజీని ప్రారంభించాలి. 6. మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యే వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఐదేళ్ల వరకు లేదా ఆసుపత్రి నిర్మాణం అయిన తరువాత జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం 80 శాతం పడకలు పేషెంట్లతో నిండేదాకా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రైవేట్ సంస్థ ఆధీనంలో ఉంటుంది. 7. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేట్ సంస్థకు ఇస్తూ ప్రభుత్వం ఒప్పందం చేస్తుంది. 8. సెలెక్ట్ పేషెంట్స్ కేటగిరీలో ఆసుపత్రిలో చేరి (ఇన్ పేషెంట్‌గా) వైద్యం లేదా శస్త్ర చికిత్సలు చేసుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ లేదా సిజిహెచ్ లేదా ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (పిఎంజెఎవై) రేట్లు ప్రకారం కాంట్రాక్టర్లకు ఫీజులు చెల్లిస్తుంది. 9. ప్రతి మూడేళ్లకు ఒకసారి డయాగ్నస్టిక్ చార్జీల రేట్లు, ఏడేళ్లకోసారి మిగిలిన అన్ని రకాల వైద్య, శస్త్ర చికిత్సల చార్జీలు పెంచుతుంది. 10. ఆరోగ్యశ్రీ కార్డ్ ఉన్న వారికి మాత్రమే ఉచితంగా వైద్యం చేయబడుతుంది. ఈ కేటగిరీలో పేషెంట్లకు శస్త్ర చికిత్సలు చేయాలంటే ముందుగా ప్రభుత్వం అనుమతి మంజూరు చేయాలి. 11. రక్త పరీక్షలు, పాథాలజీ, రేడియోలజీ వంటి పరీక్షలకు చార్జీలు చెల్లించాలి. 12. ఔట్ పేషెంట్ (ఓ.పి) లకు మాత్రమే ఉచితంగా వైద్యం చేస్తారు. 13. జనరిక్ మందులు మాత్రమే ఉచితంగా ఇవ్వాలి. 14. మెడికల్ కాలేజీతో పాటు నర్సింగ్, పారా మెడికల్, ఇతర అనేక రకాల మెడికల్ ట్రైనింగ్ కాలేజీలు కాంట్రాక్టర్ నెలకొల్పుకోవచ్చు. 15. మెడికల్ సీట్ల ఫీజులు ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈ విధానంతో ప్రభుత్వం అందరికీ ఉచిత వైద్యం అందించాలనే బాధ్యత నుండి వైదొలుగుతున్నది. ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు అందిస్తున్న సేవలకు భిన్నంగా ఇవి ఉంటాయి. ప్రభుత్వ వైద్య సేవలు పొందటానికి మొదటిసారిగా ప్రభుత్వం ప్రజలను రెండు రకాలుగా విభజిస్తున్నది. ఆరోగ్యశ్రీ కార్డ్ ఉంటేనే ఉచితంగా పరీక్షలు, శస్త్ర చికిత్సలు, బెడ్ లేదా ఇన్ పేషెంట్ వైద్యం కోసం చేర్చుకుంటారు. ఒకవేళ పేదవాళ్ళయి ఆరోగ్యశ్రీ కార్డు లేక పోతే వారికి ఉచితంగా వైద్యం చేయరు. ప్రభుత్వం సకాలంలో వైద్య బిల్లులు కాంట్రాక్టర్‌కి చెల్లించకపోతే కాంట్రాక్టర్ ఉచిత వైద్యాన్ని నిలిపి వేయొచ్చు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వైద్య బిల్లులు చెల్లించటం లేదని ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటళ్లు తరచూ ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు నిలిపివేస్తున్న విషయం తెలిసిందే. ప్రమాదానికి గురై చావు బతుకుల్లో ఉన్న వ్యక్తికి ఎమర్జెన్సీగా వైద్యం చేయరు. ప్రభుత్వం నుండి ఆమోదం వచ్చిన తరువాతే వైద్యం చేస్తారు.

## ఫార్మా రాజధానిగా హైదరాబాద్

### బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ఎమ్‌డి

**హైదరాబాద్ :**

భారత ఫార్మా రంగ రాజధానిగా హైదరాబాద్ నిలిచిందని ప్రముఖ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బిసిజి) ఇండియా ఎమ్‌డి వికాశ్ అగర్వాల్ అన్నారు. హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వినియోగదారుల పరిధి పెరుగుతున్న నేపథ్యంలో బిసిజి తన సేవలను పలు నగరాలకు విస్తరిస్తోందని, ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై తర్వాత ఇప్పుడు హైదరాబాద్‌లో కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. ఫార్మా ఉత్పత్తులలో మూడింటిలో ఒక వంతు, ఎగుమతులలో ఐదింటిలో ఒక్క వాటా కలిగి ఉందన్నారు. తెలంగాణ జిఎస్‌డిపిలో తయారీ రంగం 19.5 శాతం వాటా కలిగి ఉందన్నారు. ఇది జాతీయ సగటు 17.7 శాతం కంటే ఎక్కువన్నారు.

## నెలఖారు కల్లా దేశ వ్యాప్తంగా బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు

సిఎండి రాబర్ట్ జె రవి వెల్లడి

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ బిఎస్ఎన్ఎల్ విస్తరణలో దూకుడుగా వ్యవహరిస్తోంది. వినియోగదారులకు మెరుగైన నెట్‌వర్క్ అందించడానికి వేగంగా చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుత సెప్టెంబర్ నెలాఖరు కల్లా దేశ వ్యాప్తంగా 4జిని పూర్తిగా అమలు చేసి, తమ వినియోగదారులందరికీ అప్‌గ్రేడ్ చేసిన నెట్‌వర్క్‌ను అందజేయనున్నామని బిఎస్ఎన్ఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ రాబర్ట్ జె రవి తెలిపారు. "సెప్టెంబర్ 27న దేశవ్యాప్తంగా 4జి స్వదేశీ సాంకేతికతను ప్రారంభిస్తున్నాము" అని రవి భారత్ డిజిటల్ ఇన్‌ఫ్రా సమ్మిట్ 2025లో వెల్లడించారు. ఆగస్టు 15న ఢిల్లీలో 4జి సేవలను అందుబాటులోకి తెచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సేవల కోసం ఇప్పటివరకు ఒక లక్ష మొబైల్ టవర్లను ఏర్పాటు, అప్‌గ్రేడ్ చేసింది. తన నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత పెంచి 5జి సేవలను అందించడానికి రూ.47,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది. బిఎస్ఎన్ఎల్ 2024 జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.280 కోట్లు, అక్టోబర్ డిసెంబర్ త్రమైఆసికంలో రూ.280 కోట్ల నికర లాభాలను సాధించింది.

# పని ఎక్కువ.. పైసలు తక్కువ

## పండుగ రోజుల్లో గిగ్ వర్కర్లపై భారం పని గంటల పెంపు

**న్యూఢిల్లీ :**

ఇ-కామర్స్, డెలివరీ వేదికల్లో పని చేసే గిగ్ వర్కర్ల జీవితాలు చాలా దుర్భరంగా ఉన్నాయి. దసరా, దీపావళి పండగల సందర్భంగా ఆన్‌లైన్ విక్రయాలు, సరఫరాలు చాలా పెరిగాయి. ఒకప్పుడు పండుగ రోజుల్లో డెలివరీ వర్కర్లకు తక్కువ గంటల పని, స్థిరమైన ఆదాయాన్ని అందించే అవకాశంగా ఉండేవి. కానీ ఇప్పుడు అవి అత్యంత బిజీగా, ఒత్తిడితో కూడిన పరిస్థితులుగా మారాయి. మూడు సంవత్సరాల క్రితం, డెలివరీ వర్కర్లు ఒక రోజులో సుమారు 20 ఆర్డర్లతో రూ.600-800 సంపాదించగలిగేవారు. ఈ ఏడాది చాలామంది 14-15 గంటలు పనిచేసి, దాదాపు రెట్టింపు ఆర్డర్లను పూర్తి చేసినప్పటికీ, దాదాపు అదే మొత్తాన్ని మాత్రమే సంపాదిస్తున్నారు.దేశంలో 2020-21 నాటికి 77 లక్షల మంది గిగ్ వర్కర్లు పని చేస్తున్నారని నీతి అయోగ్ వెల్లడించింది. ఇది గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25 నాటికి 1.2 కోట్లకు చేరారని అంచనా. 2029-30 నాటికి 2.35 కోట్లకు చేరొచ్చని తెలిపింది.

ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు
ఆర్థిక భద్రత లేకపోవడం ప్రధాన ఆందోళనగా ఉంది.
ప్రావిడెంట్ ఫండ్ వంటి దీర్ఘకాలిక ప్రయోజనాలు లేకపోవడం.
శాశ్వత ఉద్యోగ అవకాశాలు తక్కువ.
రిఫెరల్ బోనసలు, అధిక గంటల వేతనాల్లో అసమానతలు.
పరిమితంగా సెలవులు.

ప్రస్తుత పండుగ సీజన్‌లో వివిధ ప్లాట్‌ఫారమ్‌లు 2.50 లక్షల మంది కంటే ఎక్కువ సీజనల్ వర్కర్లను నియమించుకున్నాయని అంచనా. ఈ సంఖ్య గత సంవత్సరం కంటే 20-25 శాతం ఎక్కువ. కంపెనీలు ఈ పెరుగుదలను సంబరంగా జరుపుకుంటున్నప్పటికీ, వర్కర్లు మాత్రం ఆర్డర్‌కు తగ్గిన చెల్లింపులు లేకపోవడంతో పాటుగా పెరిగిన పని భారాన్ని సతమతవుతోన్నారు. ఉద్యోగ నియామకాలకు కంపెనీలకు సాయం చేసే స్టాఫింగ్ సంస్థల డేటా ప్రకారం.. పండుగ వారాల్లో గిగ్ వర్కర్లు సాధారణ రోజులతో పోలిస్తే 60-80 శాతం ఎక్కువ ఆర్డర్లను డెలివరీ చేస్తారు. మరోవైపు గత సంవత్సరంతో పోలిస్తే ఆర్డర్‌కు చెల్లించే మొత్తం 25 శాతం వరకు తగ్గిందని ఆ రంగంలో పని చేసే వారు గగ్గోలు పెడుతున్నారు. బయట ఉపాధి లేక ఈ రంగంపైన ఆధారపడే గిగ్‌వర్కర్లు పెరగడంతో కంపెనీలు అదను చూసి ఆర్డర్‌కు చెల్లించే ర్టేట్లను మరింత తగ్గించాయి.సాధారణ రోజుల్లో గిగ్ వర్కర్లు 12-18 ఆర్డర్లను కలిగి ఉంటే.. పండుగ సీజన్‌లో ఇది 22-32కు చేరిందని అడెకో ఇండియా డైరెక్టర్, జనరల్ స్టాఫింగ్ హెడ్ దీపేష్ గుప్తా తెలిపారు. క్విక్ కామర్స్‌లో ఆర్డర్‌కు చెల్లించే రేట్లు గణనీయంగా తగ్గాయన్నారు. 2024లో రూ.34 నుండి రూ.42 వరకు ఉన్న చెల్లింపులు 2025లో రూ.22-30కి తగ్గాయని గుప్తా తెలిపారు. కొన్ని ప్లాట్‌ఫారమ్‌లు ఒక్కో డెలివరీకి రూ.15-25 మాత్రమే చెల్లిస్తున్నాయన్నారు. పీక్ అవర్స్‌లో రూ.13-15 సర్జ్ బోనస్‌లు అందిస్తున్నాయన్నారు. కానీ భారీ ట్రాఫిక్ కారణంగా వర్కర్లు పూర్తి చేయగల ఆర్డర్ల సంఖ్య తగ్గడంతో ఈ ప్రయోజనాలతో పెద్ద ప్రయోజనం లేదని అంటున్నారు.పని గంటలపై ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని టీమ్‌లీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణియన్ అనంత నారాయణన్ పేర్కొన్నారు. సాధారణంగా 8-10 గంటలతో పోల్చితే పండుగ సీజన్‌లో షిఫ్ట్‌లు 12-14 గంటలకు పెరిగాయన్నారు. తక్కువ చెల్లింపు, అధిక పని గంటలు గిగ్ వర్కర్లను ఆందోళన గురి చేస్తోన్నాయన్నారు.



RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్: గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

**బిజినెస్..**

## వరసగా ఐదోరోజూ నష్టాల్లోనే..

**ముంబయి:**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదోరోజూ గరువారం కూడా నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 25వేల దిగువకు చేరింది. గురువారం నిఫ్టీ 166.05 పాయింట్ల నష్టంతో 24,890.85 వద్ద ముగిసింది. అలాగే సెన్సెక్స్ ఉదయం 81,574.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,715.63) నష్టాల్లో ప్రారంభమైంది. ప్రారంభంలో కాసేపు లాభాల్లోకి వచ్చినా రోజంతా నష్టాల్లోనే కదలాడింది. చివరికి 555.95 పాయింట్ల నష్టంతో 81,159.68 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో బిఇఎల్, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మినహా మిగిలిన షేర్లు నష్టాలు చవిచూశాయి. ట్రెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఆసియా మార్కెట్‌ల్లో జపాన్ మినహా మిగిలిన మార్కెట్‌లు నష్టాల్లో ముగిశాయి. యూరోపియన్ మార్కెట్‌లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్లు, బంగారం ఔన్సు 3758 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మదుపర్ల సంపదగా భావించే బిఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.3 లక్షల కోట్లు క్షీణించి రూ.457.4 లక్షల కోట్లకు చేరింది. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు, హెచ్-1బీ వీసా రుసుము పెంపు, ట్రంప్ సుంకాలు వంటి ఆందోళనల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలూ ప్రభావం చూపాయి.



# స్థానిక యువత స్వయం ఉపాధి







**అన్వేషనేత్రం ప్రతినిధి**

కొడకండ్ల మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన వినాయక మొబైల్ షాప్ను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఝాన్సి రెడ్డి గారు మాట్లాడుతూ.. స్థానిక యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాపారాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వ్యాపారం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, యజమానికి శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క గారిని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి గారు మర్యాదపూర్వకంగా కలిశారు..



**అన్వేషనేత్రం ప్రతినిధి**

ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గంలోని రాయపర్తి మండలం, మైలారం గ్రామానికి సంబంధించిన ముఖ్య సమస్యలను ఎమ్మెల్యే గారు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ మధ్యలో నుంచి సామర్ల కుంటకు వెళ్లే ఊర కాలువ (డ్రైనేజి) ప్రస్తుతం పూర్తిగా నిరుపయోగంగా మారిందని వివరించారు. ఈ కాలువ సరిగా పనిచేయకపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండడం, వ్యవసాయ భూములకు నీటి పారుదలలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు..ఈ కాలువకు మరమ్మతులు చేసి పునరుద్ధరించినట్లయితే మైలారం గ్రామంతో పాటు చక్రు తండా, పానిష్ తండా గ్రామాల రైతాంగానికి పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ముఖ్యంగా సుమారు 500 ఎకరాల వ్యవసాయ భూమికి శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం అవుతుందని స్పష్టం చేశారు..ఎమ్మెల్యే గారి వినతిని శ్రద్ధగా విన్న మంత్రి సీతక్క గారు సమస్యపై సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుని కాలువ మరమ్మతుల పనులు చేపట్టేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు..ఈ సమావేశం ద్వారా స్థానిక రైతాంగానికి ఉపశమనం కలిగే దిశగా కీలక అడుగు పడినట్లుగా భావిస్తున్నారు..




గత ప్రభుత్వ మాయ మాటలకు నిరుపేద రాజ లు రాయపడతి మండలం పెరికేడు గ్రామంలో 40 ఇండ్లు కూలగొట్టుకుని నిలువ నీడ లేకుండా రోడ్డున పడ్డారు తొర్రూర్

6 వార్డు లో కూడ గత పాలకుల మాటలకు వాళ్ళు కూడ ఇండ్లు కులా గొట్టుకున్నారు వాళ్ళు ఎంతో ఆందోళనకు చెందుతున్నారు వీళ్ళకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని స్పీకర్ సార్ మీ ద్వారా మంత్రి గారిని కోరుకుంటున్నాను అంతే కాకుండా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు అసెంబ్లీ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుర్తి, తొర్రూరు మండలాల్లోని పలు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలగొట్టుకున్న పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాలకుర్తి నియోజకవర్గానికి ఇప్పటికే 3,500 ఇండ్లు వచ్చాయని, పేదలకు త్వరలో మరిన్ని ఇండ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు



హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఛాంబర్ లో రాష్ట్ర షెడ్యూల్డ్ కాస్ట్స్ అభివృద్ధి, గిరిజన సంక్షేమం, మైనారిటీల సంక్షేమం, వికలాంగుల సాధికారత, వృద్ధుల సంక్షేమం మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ గారిని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి గారు మర్యాదపూర్వకంగా కలిశారు..ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో గిరిజనులకు అవసరమైన మౌలిక వసతుల కొరతపై ఎమ్మెల్యే గారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గిరిజనులు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు గిరిజన భవనాల అవసరం ఉందని వివరించారు..ఎమ్మెల్యే గారి వినతిని సానుకూలంగా స్వీకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ గారు వెంటనే స్పందించి, పాలకుర్తి నియోజకవర్గానికి రెండు గిరిజన భవనాలను మంజూరు చేయడానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకుంటామని ఆయన తెలిపారు..ఈ హామీతో నియోజకవర్గ గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా, భవిష్యత్తులో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు..

# పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి దిశగా కీలక అడుగు



పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి దిశగా కీలక అడుగు పడింది. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు దేవాదాయ, పర్యావరణ ఒ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ గారిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు..ఈ సందర్భంగా పాలకుర్తి మండలం, శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి సంబంధించిన పలు పనుల ప్రతిపాదనలను మంత్రి గారికి వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించిన ఎమ్మెల్యే గారు, ముఖ్యంగా కాలినడక మార్గం, మెట్లు, పాత్‌వే, కళ్యాణ మండపం నిర్మాణం, అఖండ జ్యోతి, 200 కిలోలీటర్ల సంప్ వంటి మౌలిక



వసతుల అవసరాన్ని ప్రస్తావించారు.ఈ పనుల కోసం మొత్తం రూ.4.65 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరుతూ అధికారిక లేఖను మంత్రి గారికి అందజేశారు. ఆలయ అభివృద్ధి జరిగితే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రాంతీయంగా ఆధ్యాత్మిక పర్యాటకం కూడా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గారు తెలిపారు..వినతిని స్వీకరించిన మంత్రి కొండా సురేఖ గారు సమస్యను సానుకూలంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం..





ఈరోజు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల గ్రామ వాస్తవ్యులు జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ గారి తండ్రిగారైన జాటోత్ లచ్చా నాయక్ గారు ఇటీవల పరమపదించగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ పెదగాని సోమన్న గారు ఈ కార్యక్రమంలో నాయకులు పరిపాటి రామ్మోహన్ రెడ్డి, బొమ్మన బోయిన కుమార్, భూక్య పత్యా నాయక్, పాల శ్రీనివాస్, భూక్య రవి కుమార్ నాయక్ మరియు పైండ్ల సోమన్న తదితరులు వారి చిత్రపటానికి నివాళులర్పించడం జరిగింది












ఈరోజు దేవాదాయ ధర్మాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ గారిని జూబ్లీహిల్స్ నివాసంలోని కురవి వీరభద్ర స్వామి ఆలయ పురోహితులు పెనుగొండ నాగేందర్ గారితో కలిసి మంత్రి కొండా సురేఖ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన యువజన కాంగ్రెస్ కొండా యువసేన రాష్ట్ర నాయకులు సిలివేరు అనిల్ వీరభద్ర స్వామి ఆలయంలోని పురోహిత సమస్యపై మంత్రి గారికి వివరణ ఇవ్వగా మంత్రిగారు తమ సమస్యను ఆలయ ఈవో గారికి చెప్పి సమస్యను వెంటనేతీరుస్తానని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా మంత్రి గారికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో వరంగల్ కు జరుగుతున్న అన్యాయం పట్ల పార్లమెంట్ ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య గారు గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించాల్సిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) అమలులో జరుగుతున్న లోపాలపై లోక్‌సభలో ప్రశ్నించారు.ఈ పథకం కింద 125 రోజుల వరకు ఉపాధి కల్పించే అవకాశం ఉన్నప్పటికీ, వరంగల్ జిల్లాలో ఆ లక్ష్యం సాధనలో తీవ్ర వైఫల్యం ఉన్నదని ఎంపీ పేర్కొన్నారు. 2023–24 సంవత్సరంలో 100 రోజులకు పైగా ఉపాధి పొందిన కుటుంబాలు కేవలం 42 మాత్రమే ఉండగా, 2024–25లో అది మరింత తగ్గి 29 కుటుంబాలకు పరిమితమైందని వెల్లడించారు. ఈ సంఖ్యలు రాష్ట్రం,దేశ సగటుతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆవేదన వ్యక్తం చేశారు..జిల్లాలో నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, చెక్‌డ్యామ్‌లు, సాగునీటి, భూగర్భ జలాల పునరుద్ధరణకు



సంబంధించిన పనులు చేపట్టినప్పటికీ---గత రెండేళ్లలో 5,348 పనులు పూర్తయ్యి రూ.65 కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ---గ్రామీణ కుటుంబాలకు సరిపడ ఉపాధి కల్పించడంలో అసలు లక్ష్యం నెరవేరలేదని ఎంపీ గారు పేర్కొన్నారు.2025లో తీసుకొచ్చిన "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ)" చట్టం కింద 125 రోజుల ఉపాధి హామీ అమలు ఇంకా ప్రారంభం కాలేదని ఎంపీ తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ హామీని అమలు చేయాలని, తెలంగాణలో పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని డా. కడియం కావ్య గారు డిమాండ్ చేశారు. దీంతో వరంగల్ జిల్లాలోని గ్రామీణ కుటుంబాలకు అదనపు పనిదినాలు, సమయానికి వేతనాలు లభించి జీవనోపాధి మెరుగుపడుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.




# ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న





అన్వేషనేత్రం ప్రతినిధి

ఉప్పల్ ఇన్‌చార్జ్ శ్రీ మందముల పరమేశ్వర్ రెడ్డి అన్న గారి సహకారంతో ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న ప్రముఖ నాయకులు నెమలి అనిల్ కుమార్ గారు శక్తిసాయి నగర్ డివిజన్‌లోని సుభాష్ నగర్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నాచారం సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (జుజు) రమేష్ కుమార్ గారితో కలిసి ప్రాంతంలోని రోడ్ల దుస్థితిని పరిశీలించి, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న నెమలి అనిల్ కుమార్ గారు, సుభాష్ నగర్ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి, తక్షణ చర్యలు తీసుకునేలా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి గారు, కోయలకొండ రాజేష్ గారు, అన్వర్ గారు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా సమీక్ష సమావేశం...

సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు గారు సూర్యాపేట జిల్లా కేంద్రంలో పార్లమెంట్ పరిధిలో ఏప్రిల్ 14 ప్రపంచ మేధావి ఆధునిక భారతదేశ పితామహుడు భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ గారి జయంతి సభను విజయవంతం చేయాలని బాబాసాహెబ్ నిజమైన వారసులు తండ్రి కాన్సిరాం గారు నిర్మించిన పార్టీ సమస్త హక్కులు కోల్పోయిన జాతులకు రాజ్యాధికారం రుచి చూపించి బహుజన సమాజ్ పార్టీ మనకు అందించడం జరిగింది.భారతదేశంలోని ప్రజలందరి హక్కులు ఆత్మగౌరవం అధికారం కోసం పోరాటం చేస్తున్న బావి భారత ప్రధాని అక్క మాయావతి గారు నాయకత్వం బలపరుస్తు, తెలంగాణ



రాష్ట్రంలో సామాజిక పరివర్తన ఉద్యమాన్ని కొనసాగిస్తున్నా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గౌరవ శ్రీ ఇబ్రం శేఖర్ అన్న గారి నాయకత్వం నడవాలని కోరుకుంటూ ఏప్రిల్ 14న జరిగే సభను విజయవంతం చేయాలని జిల్లా సమక్ష సమావేశానికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్ గారు, విశిష్ట అతిథులుగా జోనల్ ఇన్చార్జి ప్రభు కుమార్ గారు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నికల సమన్వయకర్త మంచాల శ్రీకాంత్ అన్నగారు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్లమెంటు బాధ్యులు మామిడి స్టాలిన్ గారు, జిల్లా కార్యదర్శి బాబురావు గారు, కోదాడ అసెంబ్లీ అధ్యక్షులు వీరస్వామి గారు, తుంగతుర్తి అసెంబ్లీ అధ్యక్షులు చెరుకుపల్లి లక్ష్మణ్ గారు,రేపటి అసెంబ్లీ అధ్యక్షులు చింత నవీన్ గారు, తుంగతుర్తి అసెంబ్లీ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గారు, తుంగతుర్తి అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఇందనూరు యాదగిరి గారు, నూతనకల్ మండల అధ్యక్షులు కందుకూరు నరేంద్ర గారు తదితరులు పాల్గొన్నారు. ఎర్ర రాంబాబు సూర్యాపేట జిల్లా అధ్యక్షులు వార్డ్ మెంబర్







ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మోతా రోహిత్ గారి నాయకత్వంలో ఐమాక్స్ థియేటర్ ఎదురుగా ఇందిరా గాంధీ విగ్రహం దగ్గర నుండి రాజ్ భవనం దాకా పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎల్పీజీ ధరల పెరుగుదల మరియు సిలిండర్ల కొరతకు వ్యతిరేకంగా రాజ్ భవన్ నిరసనలో పాల్గొని జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటూరి రమేష్ గారు మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు ధరల పెరుగుదల మరియు ఎల్పీజీ సిలిండర్ల కొరత వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న ఈ సమయంలో, వారి తరపున మన స్వరాన్ని ఎత్తుకుందాం। అని చెప్పడం జరిగింది


# ఇందిరమ్మ భీమా.. ప్రతి ఇంటికి ధీమా

తెలంగాణలోని 1.15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా కవచం
ప్రపంచంలోనే అతి పెద్ద పథకాన్ని ప్రకటించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
యజమాని చనిపోతే.. కుటుంబం రోడ్డున పడకుండా రూ. 5 లక్షల పరిహారం
ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ప్రవేశ పెట్టనున్న సీఎం రేవంత్ రెడ్డి గారు...
నేనావత్ దేవరన్(అభిలాష్)నాయక్
కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు


















# సామాన్యుడి సింహ గర్జన సభను విజయ వంతం చేయండి

సూర్యాపేట, మార్చి 25, అన్వేషనేత్రం : ఏప్రిల్ 14 న డాక్టర్.బి. ఆర్. అంబేద్కర్ జయంతి



సందర్భంగా జరుగు సామాన్యుడి సింహ గర్జన సభ ను విజయవంతం చేయాలనీ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సూర్యాపేట జిల్లా ఇంచార్జి పరీక్ష రాజు అన్నారు బుదవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రైతు బజార్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద సింహ గర్జన సభ పోస్టల్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ భారత దేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షులు చిప్పలపల్లి జయశంకర్ మాదిగ, చెరుకుపల్లి సందీప్, దాసరి అరుణ్ టీఎండి జిల్లా నాయకులు తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆలకుంట్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ" బార్ అధ్యక్షుడిగా" పోటీ చేస్తున్న మా గురువుగారు సీనియర్ అడ్వకేట్" దర్శనం నరసింహ" ...!



తెలంగాణ రాష్ట్రంలోనే పేరెన్నిక గలిగి న్యాయవాది వృత్తికే కేరాఫ్ అడ్రస్ గా ఉన్న... మా జ్యూడిషియల్ గురువుగారు "శ్రీ దర్శనం నరసింహ" గారిని భారీ మెజారిటీతో గెలిపించగలరని మనవి...., దేశంలోన...., సంచలనాత్మకమైనటువంటి "ప్రణయ్– అమృత " కేసులో వాదించి, ప్రలోభాలకు లొంగకుండా దోషులకు శిక్ష పడేలా చేసిన గొప్ప న్యాయవాదిగా, అంతర్జాతీయ స్థాయిలో ఆయనకు పేరు కలదు. రాజ్యాంగ విలువలు కాపాడుత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటును వినియోగించుకోవాలని, మంచి వ్యక్తిత్వం, వృత్తి నైపుణ్యం, సామాజిక సమానత్వం, ఆర్థిక సమానత్వాన్ని పెంపొందిస్తూ...., ప్రజాస్వామ్య విలువలను కాపాడే గొప్ప మనస్తత్వం కలవాడు. మద్యానికి, డబ్బుకు అమ్ముడుపోయి, కుల,మతాలకు లోనై న్యాయవాద వృత్తిని భ్రష్టు పట్టిస్తూ బార్ ఎన్నికలను కూడా వ్యాపారంగా మార్చుకునే సంస్కృతికి పాతరిస్తూ...., ప్రజాస్వామ్య విలువలను పెంచుతున్న "దర్శనం నరసింహ" గారిని భారీ మెజార్టీతో గెలిపించాలని మనవి. పూలే –అంబేద్కర్ –బుద్ధుడు మొదలగు త్యాగమూర్తుల యొక్క ఆలోచన విధానాన్ని కలిగి ఉండి , 'రూల్ ఆఫ్ లా" గా ఉన్నటువంటి భారత రాజ్యాంగాన్ని కాపాడుత...., అందరివాడిగా గుర్తింపు పొందిన సార్ లాంటి వారు గెలిస్తే బార్ అసోసియేషన్ ద్వారా కోర్టు ఉన్నతి పెరుగుతుంది. సామాన్యులక, పేదవారికి సైతం అడ్వకేట్ల పైన కోర్టుల పైన పూర్తి నమ్మకం ఉంటుంది. అందువల్ల "దర్శనం నరసింహ " గారికి అడ్వకేట్ లందరూ ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించగలరని మనవి. ఇటీవల కాలంలో మీడియా రంగంలో దూసుకుపోతున్న, "సత్య న్యూస్" ఛానల్ద్వారా, న్యాయవాది వృత్తి లో.., "ఉత్తమ న్యాయవాది " అవార్డు పొందినటువంటి, ఏకైక న్యాయవాదే, మనందరి" దర్శనం నరసింహ" గారు..., తప్పకుండా సార్ కు ఓటేసి,భారీ మెజార్టీతో గెలిపించి ,నల్లగొండ బార్ ఉన్నతిని, ఉనికిని కాపాడుతూ...,తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచాలని, ఉంచేలా సార్ చేస్తారని నమ్మకంతో......., మీ అందరికీ నా హృదయపూర్వకమైన నమస్కారాలు తెలియజేస్తూ....., తప్పకుండా" దర్శనం నరసింహ" గారికి ఓటు వేయాలని వేడుకుంటున్నాను..., మీ సోదరి....,

శ్రీమతి గాదె గీత, అడ్వకేట్.,నల్లగొండ జిల్లా కోర్టు.

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య గారు ఉ జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జసత్యం..

6 నెలల దీజ కాలేజీ హాస్టళ్ళ, ప్రీ మెట్రిక్ మెస్ బిల్లులు , ఫీజుల బకాయిలు అలాగే హాస్టల్ అద్దె బకాయిలు చెల్లిచాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు గారిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారిని కలవడం జరిగింది...

గుజ్జ సత్యం
జాతీయ ఉపాధ్యక్షులు
జాతీయ బీసీ సంక్షేమ సంఘం.



# ఈరోజు హాలియా మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ప్రభుత్వం







ప్రతిష్టాత్మాకంగా చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక ప్రోగ్రామ్ లో హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి గారు మున్సిపల్ సిబ్బంది తో మెయిన్ రోడ్డు వెంబడి షాపులోకి వెళ్లడానికి మట్టి పోసి ర్యాంపు ఏర్పాటు చేసుకున్నారు. అట్టి మట్టి పేరకపోయి ప్రయాణికులకు చాలా ఇబ్బంది కలుగుతుందని అట్టి మట్టిని శుభ్రం చేయించడం జరిగింది. ఇకపై నైనా షాపుల ముందు కాంక్రీట్ తో ర్యాంపులు షాపుల ముందు యజమానులు పోయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పారిశుద్ధ కార్మికులు పాల్గొనడం జరిగినది.

# హబ్సిగూడలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

ఈరోజు ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడ డివిజన్లో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్––మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ గారు, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి గారు హబ్సిగూడ డివిజన్ కాబోయే







కార్పొరేటరు కంది శ్రవణ్ రెడ్డి గారు హాజరై నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.??లిఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ గారు మాట్లాడుతూ రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ కాంగ్రెస్ పార్టీని ప్రజల్లో మరింత బలంగా తీసుకెళ్లాలని అన్నారు.పరమేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి పేదల హృదయంలో వెలుగులు నింపిన కాంగ్రెస్ ఇండ్లు ఇవ్వటమే కాకుండా ఒక అన్నగ వాళ్ళకు బట్టలు పెట్టి వారికీ కావలిసిన అన్ని ఏర్పాట్లు చూసుకున్న గొప్ప మనసున్న నాయకుడు

ప్రభుత్వ చీఫ్ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య






RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

# ఆట



## ప్రాక్టీస్ మ్యాచ్‌లో దుమ్మురేపిన కోహ్లీ

ఐపీఎల్ 2026 సీజన్ కోసం డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) సిద్ధమవుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సన్నదమవుతోంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ప్రాక్టీస్ క్యాంప్‌లో ముమ్మరంగా సాధన చేస్తోంది. మరో 5 రోజుల్లో ఈ క్యాష్ రిచ్ లీగ్ తెరలేవనుండటంతో అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకోంటుంది. ఈ సన్నాహకాల్లో భాగంగా ఆదివారం ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడింది. జట్టులోని ఆటగాళ్లంతా రెండు జట్లుగా విడిపోయారు. ఒక జట్టుకు కృనాల్ పాండ్యా సారథ్యం వహించగా.. మరో జట్టును వెకంటేష్ అయ్యర్ నడిపించాడు. ఈ సన్నాహక మ్యాచ్‌లో జితేశ్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ చెలరేగాడు. 37 బంతుల్లోనే 81 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. గత సీజన్ తరహాలోనే ఈ సీజన్‌లోనూ ఆర్‌సీబీ ఫినిషర్‌గా సత్తా చాటేందుకు రెడీ అయ్యాడు. అతని తర్వాత ఆస్ట్రేలియా ఆటగాడు టీమ్ డేవిడ్ 14 బంతుల్లో 36 పరుగులు చేశాడు. రూ.7 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేష్ అయ్యర్ 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు.ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆర్‌సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 12 బంతుల్లో 3 సిక్స్‌లతో 29 పరుగులు చేశాడు. తక్కువ పరుగులే చేసినా.. దూకుడుగా ఆడాడు. వెంకటేశ్ అయ్యర్‌ను మిడిలార్డర్‌లో ఆడించాలనే యోచనలో ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌కు సంబంధించిన ఒక వీడియోను ఆర్‌సీబీ ఫ్రాంచైజీ సోమవారం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ వీడియోలో కృనాల్ పాండ్యా మాట్లాడుతూ.. 'ఇది ఒక గొప్ప ప్రాక్టీస్ మ్యాచ్. భువనేశ్వర్ కుమార్, అభినందన్ సింగ్, మంగేష్ యాదవ్ బౌలింగ్‌లో బాగా రాణించాడు. జితేష్ శర్మ, టీమ్ డేవిడ్, వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు'అని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్‌సీబీ తమ తొలి టైటిల్‌ను అందుకున్న విషయం తెలిసిందే. ఈ జోరును తాజా సీజన్‌లోనూ కొనసాగించి టైటిల్ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే ఆర్‌సీబీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఫస్టాఫ్ షెడ్యూల్‌లో ఆర్‌సీబీ.. చిన్నస్వామి స్టేడియంలో రెండు మ్యాచ్‌లు ఆడనుంది. గౌహతిలో రాజస్థాన్ రాయల్స్, ముంబైలో ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది.



## 20 మంది కోర్ టీమ్ తో టీమిండియా సిద్ధం

క్రికెట్ ప్రపంచంలో అతిపెద్ద సమరం వన్డే వరల్డ్ కప్ 2027కు ఇంకా సమయం ఉన్నప్పటికీ, టీమిండియా సెలెక్టర్లు అప్పుడే తమ మాస్టర్ ప్లాన్‌ను రెడీ చేసేశారు. ఒకవైపు ఆటగాళ్లందరూ ఐపీఎల్ 2026 హడావుడిలో ఉంటే, మరోవైపు బీసీసీఐ సెలెక్షన్ కమిటీ మాత్రం మిషన్ 2027 కోసం 20 మంది కోర్ టీమ్ (ప్రధాన ఆటగాళ్లు)ను దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న ఈ మెగా టోర్నీ కోసం సెలెక్టర్లు వేస్తున్న వ్యూహాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. సౌతాఫ్రికా, జింబాబ్వేలోని పిచ్‌లు ఫాస్ట్ బౌలర్లకు స్వర్గధామం. బంతి బాగా బౌన్స్ అవ్వడమే కాకుండా వేగానికి సహకరిస్తాయి. అందుకే సెలెక్టర్లు ఆరుగురు స్పెషలిస్ట్ ఫాస్ట్ బౌలర్లను తమ 20 మంది జాబితాలో చేర్చారు. జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణలతో పాటు యంగ్ సెన్సేషన్ హర్షిత్ రాణా కూడా ఈ రేసులో ఉన్నారు. అయితే, గత వరల్డ్ కప్‌లో వికెట్ల వేట సాగించిన మొహమ్మద్ షమీ పేరు ఈ లిస్టులో లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఫిట్‌నెస్, వయస్సు రీత్యా షమీని పక్కన పెట్టి యువతరం వైపు మొగ్గు చూపాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం. చాలా కాలంగా అభిమానుల మనసులో మెదులుతున్న ప్రశ్న.. 2027 వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఉంటారా? అని. తాజా సమాచారం ప్రకారం, సెలెక్టర్లు సిద్ధం చేసిన 20 మంది జాబితాలో ఈ ఇద్దరు దిగ్గజాల పేర్లు కూడా ఉన్నాయి. జట్టుకు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, రోహిత్, కోహ్లీ అనుభవం జట్టుకు అవసరమని సెలెక్టర్లు భావిస్తున్నారు. యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, ఇషాన్ కిషన్ వంటి యువ ఆటగాళ్లకు వీరిద్దరి మార్గదర్శకత్వం తోడైతే కప్పు గెలవడం సులువని బోర్డు యోచిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్‌ను సెలెక్టర్లు ఒక గొప్ప ఆడిషన్ లాగా చూస్తున్నారు. పీటీఐ రిపోర్ట్స్ ప్రకారం.. సెలెక్షన్ కమిటీ సభ్యులు దేశవ్యాప్తంగా వివిధ మైదానాల్లో జరిగే మ్యాచులను ప్రత్యక్షంగా వీక్షించనున్నారు.


## ఐసీసీ అవార్డుల్లో భారత్, పాక్ జోరు..

అంతర్జాతీయ క్రికెట్ మండలి ఫిబ్రవరి 2026 నెలకు సంబంధించి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డులను ప్రకటించింది. ఈసారి భారత్, పాకిస్థాన్ ఆటగాళ్లు చెరో అవార్డును దక్కించుకోవడం విశేషం. పురుషుల విభాగంలో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్, మహిళల విభాగంలో భారత పేసర్ అరుంధతి రెడ్డి ఈ ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా ఇటీవలే ముగిసిన టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుత ప్రదర్శన చేసినందుకు ఫర్హాన్ కు ఈ గౌరవం దక్కింది. పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ టీ20 వరల్డ్ కప్ 2026లో మునుపెన్నడూ లేని విధంగా చెలరేగిపోయాడు. పాకిస్థాన్ జట్టు సూపర్-8 దశలోనే నిష్క్రమించినప్పటికీ, ఫర్హాన్ వ్యక్తిగత ప్రదర్శన మాత్రం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. కేవలం 6 ఇన్నింగ్స్‌ల్లోనే 76.6 సగటుతో 383 పరుగులు రాబట్టాడు. ఇందులో రెండు అద్భుతమైన సెంచరీలు ఉండటం గమనార్హం.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

# సినిమా

CINEMA




## అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రెసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ-లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్-ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో, ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేసే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు మాత్రం ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అట్లీ షేర్ చేసిన లయన్ పోస్టర్ నిజంగానే అల్లు అర్జున్ పాత్రపై హింట్ ఇస్తుందా? లేక ఇది కేవలం ఆసక్తి రేకెత్తించే ప్రమోషనల్ స్టాటజీనా? అన్నది తెలియాలంటే టీజర్ రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.

## పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో క్రూషియల్ షెడ్యూల్‌తో బిజీగా ఉంది చిత్ర యూనిట్. నాలుగు రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరగనుందని సమాచారం. ఇక పెద్ది సినిమా నుంచి టీజర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్. అఫీషియల్ కన్ఫర్మేషన్ లేకపోయినా, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న పెద్ది టీజర్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, చరణ్ బర్త్ డేకి మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ, ఇప్పటి వరకు పెద్ది టీమ్ నుంచి టీజర్ గురించి ఎలాంటి అప్డేట్ లేదు. మెగాభిమానులు మాత్రం ఈసారి తమ అభిమాన హీరో బర్త్ డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. మార్చి 26 సాయంత్రం నుంచి హైదరాబాద్ శిల్పకళా వేదికలో గ్రాండ్ ఈవెంట్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రామ్ చరణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. నార్త్ అమెరికాలో మార్చి 26 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక్కడి నుంచి పెద్ది సౌండ్ గట్టిగా ఉంటుందని నమ్ముతున్నారు మెగాభిమానులు.




Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434